క్లుప్తంగా

'అసత్య ఆరోపణలు సరికాదు'



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ఎంపీపీ

బోథ్: తాను రూ.50 వేలు తీసుకున్నట్లు అసత్య ఆరోపణలు చేయడం సరికాదని, బోథ్ వైస్ ఎంపీపీ లింబాజీ తన మాటలను రుజువు చేయాలని ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో తన అనుచరులతో మాట్లాడారు. మర్లపెల్లి గ్రామంలో రూ. 5 లక్షలతో పాఠశాల మరమ్మతులు చేయించడానికి నిధులు మంజూరు చేస్తే పనులు చేయలేదన్నారు. చింతగూడ గ్రామ సర్పంచ్ లింగు మాట్లాడుతూ.. వైస్ ఎంపీపీ లింబాజీ తమ గ్రామానికి ఉపాధిహామీ నిధులతో రోడ్డు వేసినట్లు నిధులు తీసుకున్నారన్నారని ఆరోపించారు. అనంతరం వైస్ ఎంపీపీ లింబాజీపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రాజకీయ నాయకులతో సమావేశం



సమావేశమైన రిటర్నింగ్ అధికారి

బోథ్: బోథ్ నియోజకవర్గంలో అన్ని మండలాల రాజకీయ నాయకులు, తహసీల్దార్లతో రిటర్నింగ్ అధికారి కదం సురేశ్ శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ప్రత్యేక ఓటరు నమోదు గురించి చర్చించారు. అన్ని గ్రామాల్లో బీఎల్‌వోలు ప్రతి ఇంటిని సందర్శించి అర్హత గల వారిని ఓటరుగా చేర్పించాలని సూచించారు. చేర్పులు, మార్పులు చేయాలన్నారు. ప్రతీబూత్‌కు బూత్ లెవల్ అసిస్టెంట్‌లను నియమించుకోవాలని సూచించారు.

29 నుంచి జొన్న కొనుగోళ్లు

జైనథ్: మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డ్‌లో జొన్నల కొనుగోళ్లను ఈనెల 29నుంచి నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జొన్నలకు క్వింటాల్‌కు రూ. 2970 మద్దతు ధర ప్రకటించిందని, ఎకరానికి 8 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్నికల కార్యకలాపాలు బోథ్‌లోనే నిర్వహించాలి



రిటర్నింగ్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బోథ్: ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని కార్యకలాపాలను బోథ్‌లోనే నిర్వహించాలని బోథ్ బచావో సమితి సభ్యులు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సురేశ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఎన్నికల నిర్వహణ అధికారి భవనాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో బోథ్ బచావో ఆందోళన్ సమితి కన్వీనర్ చంటి, కో కన్వీనర్ షేక్ షాకీర్, సుమేర్ పాషా, కుర్మె మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

బేల: మండలంలోని గూడ గ్రామంలో శుక్రవారం యూత్ సభ్యులకు యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి క్రీడా సామగ్రి అందజేశారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో జైనథ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వాంఖడే వామన్, గావుండే ఘణేశ్యాం, ఎండీ అఖిల్, రూప్‌రావు, మడావి చంద్రకాంత్, బోక్రే శంకర్, గోడే అవినాష్, ఠాక్రే విపిన్, నరేందర్, వినోద్ పాల్గొన్నారు.

ముగిసిన కంటివెలుగు

తాంసి: భీంపూర్ మండలంలోని పలు గ్రామాల్లో నాలుగు నెలలుగా నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమం శుక్రవారం ముగిసింది. వైద్యాధికారి అశ్విని ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. భీంపూర్ మండలంలో మొత్తం 11035 మందికి పరీక్షలు నిర్వహించగా.. 996 మందికి రీడింగ్ కళ్లద్దాలు పంపిణీ చేయడంతో పాటు, 951 మందికి అద్దాలను పంపిణీ చేశారు. వీటితో పాటు 1264 మందికి కళ్లద్దాలు ఆర్డర్ చేశారు. 1249 మందికి ఆపరేషన్ కోసం గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జ్ఞానేశ్వర్, శ్రీకాంత్, గంగాధర్ పాల్గొన్నారు.

బాసట లేక భారంగా..

సిరికొండ: కులవృత్తిని నమ్ముకొని జీవిస్తున్న వారి జీవితాలు రోజురోజుకూ దుర్భరంగా తయారవుతున్నాయి. ఏళ్ల తరబడి ప్రభుత్వం ఆదుకోకపోవడంతో చాలీచాలని ఆదాయంతో కాలం వెల్లదీస్తున్నారు. తరతరాలుగా వస్తున్న కులవృత్తిని నమ్ముకుని కుటుంబాన్ని నెట్టుకొస్తున్న వారి పరిస్థితి దయనీయంగా మారింది. వృత్తే దైవంగా భావిస్తూ బాసట లేక బతుకులు భారంగా మారుతున్నాయి.



వాగులోనే బట్టలు ఉతుకుతున్న రజకులు



కుండలు తయారు చేస్తున్న కుమ్మరి

- కనుమరుగవుతున్న కులవృత్తులు
- ప్రభుత్వ ప్రకటనతో హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

మండలంలో అనేక గ్రామాల్లో ప్రజలు కులవృత్తిని నమ్ముకొని జీవిస్తున్నారు. వీరిలో కుమ్మరులు, కమ్మరులు, వడ్రంగులు, చాకలి, నాయీబ్రాహ్మణులు, మేదరులు వృత్తిని దైవంగా భావిస్తూ.. కాలం వెల్లదీస్తున్నారు. ప్రస్తుతం కులవృత్తులను ప్రభుత్వాలు ప్రోత్సహించకపోవడంతో ఆర్థికంగా చితికిపోతున్నారు. వారు తయారు చేసిన వస్తువులకు ప్రత్యామ్నాయంగా మార్కెట్లో రెడీమెడ్ వస్తువులు రావడంతో కుదేలవుతున్యనారు. ఒకప్పుడు కుమ్మరి కుండల్లో, రంజాన్‌ల్లోని చల్లని నీటిని తాగేవారు. ప్రస్తుతం ఫ్రిజ్‌లు రావడం కుమ్మరులు తయారు చేసే కుండలకు డిమాండ్ లేకుండా పోయింది. పల్లెల్లో వ్యవసాయం చేయాలంటే వడ్రంగి, కమ్మరి వారు అవసరం ఉండేది. వ్యవసాయ రంగంలో ఆధునిక యాంత్రాలు రావడంతో కులవృత్తులపై ఆధారపడిన వారి బతుకులు భారంగా మారాయి. నమ్ముకున్న వృత్తిని వదిలి గ్రామాల్లో కూలీలుగా మారుతున్నారు.

ప్రోత్సాహం కల్పిస్తే..

ప్రభుత్వాలు కులవృత్తులు చేసే వారిని ఆర్థికంగా ఆదుకొని ప్రోత్సాహం కల్పించాలి. గ్రామాల్లో మురికి బట్టలను శుభ్రం చేసే రజకులకు దోభీఘాట్‌లు నిర్మించాలి. కుమ్మరులకు సబ్సిడీపై కుండలు తయారు చేసేందుకు ఉపయోగించే విద్యుత్ యంత్రం అందించాలి. నాయీబ్రాహ్మణులకు, మేదరులకు ఆధునిక యంత్రాలు అందించాలి. అలాగే వయస్సు పైబడిన వారికి ఆసరా పింఛన్ అమలు చేయాలి.

ప్రభుత్వ ప్రకటనతో హర్షం..

రాష్ట్రంలోని కులవృత్తుల వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలని ఒక్కోలబ్ధిదారుకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించాలని ఇటీవలే కేబినేట్ నిర్ణయించడంతో కులవృత్తులపై ఆధారపడిన హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే సబ్సిడీ యంత్రాలు, పింఛన్ పథకాలు, బ్యాంకు రుణాలు కూడా అందజేయాలని వారు కోరుతున్నారు.



పని లేక వెలవెలబోతున్న కమ్మరి కొలిమి

ఎలాంటి సాయం అందలేదు



కులవృత్తి దైవంతో సమానం. నేను నా చిన్నప్పటి నుంచి కుండలు చేస్తూ.. కుటుంబాన్ని పోషిస్తున్నాను. ప్రభుత్వం ద్వారా ఎలాంటి సాయం అందలేదు. మాకు సబ్సిడీపై విద్యుత్ యంత్రాలు అందించి, ఆర్థికంగా ఆదుకోవాలి.

– గుగ్గిళ్ల లస్మన్న, కుమ్మరి కులస్తుడు, సిరికొండ

దోబీఘాట్‌లు నిర్మించాలి



నేను చదువుకోలేదు. మా కులవృత్తి బట్టలు ఉతకడం తప్పా.. మారే పని రాదు. గ్రామంలో బట్టలు ఉతుకుతుంటాను. గ్రామ సమీపంలో దోబీఘాట్‌లు లేకపోవడంతో చాలా ఇబ్బంది అవుతుంది. గ్రామంలో దోభీఘాట్‌లు నిర్మించాలి.

– లస్మన్న, రజకుడు, సిరికొండ

రైతులకు అవగాహన సదస్సు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో

బోథ్: మండలంలోని ధన్నూర్ గ్రామంలో ఏఈవో అర్జుహి రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువులు వాడాలని, నకిలీ విత్తనాలను కొనుగోలు చేయవద్దని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నారాయణరెడ్డి, మార కరణాకర్ రెడ్డి, హరీష్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జేపీఎల్ విజేత రైజర్స్ జట్టు



ట్రోఫీ అందజేస్తున్న బాలూరి గోవర్ధన్ రెడ్డి

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన జేసీఏ జూనియర్ ప్రీమియర్ లీగ్‌లో జేసీఏ రైజర్స్ జట్టు విజేతగా నిలిచింది. 15వ ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 111 పరుగులు చేసింది. బ్యాటింగ్‌కు దిగిన టైటాన్స్ జట్టు 8 వికెట్ల నష్టానికి 76 పరుగులకు మాత్రమే పరిమితమైంది. మూడు వికెట్లు తీయడంతో పాటు 17 పరుగులు చేసిన సైఫ్ బిన్ సోహెల్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. వీరికి జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు జయేంద్ర పటాస్కర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

బాలాజీగుట్టపై పూజలు



నార్నూర్: మండల కేంద్రంలోని విజయ్‌నగర్ కాలనీ బాలాజీగుట్టపై వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ, ప్రధాన అర్చకులు సాయి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. గాదిగూడ, జైనూర్, సిర్పూర్(యూ), కెరిమెరి మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఘనంగా మనీషా జన్మదిన వేడుకలు

ఎదులాపురం: మాజీ మున్సిపల్ చైర్మన్ రంగినేని మనీషా జన్మదిన వేడుకలను శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఆమె నివాసంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులతో పాటు కుల సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు హాజరై ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, మాజీ ఎంపీ నగేశ్ హాజరయ్యారు. ఆదివాసీలు చేసిన గుస్సాడీ నృత్యం ఆకట్టుకుంది. రంగినేని మనీషా, పవన్‌రావు దంపతులను నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు దత్తు, కలాల శ్రీనివాస్, పార్థసారథి, బీజేపీ నాయకులు కౌన్సిలర్ రఘుపతి, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



రంగినేని మనీషా, పవన్‌రావు దంపతులను సన్మానిస్తున్న నాయకులు

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

ఉట్నూర్‌రూరల్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత నెలకొంటుందని జిల్లా జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ అన్నారు. మండలంలోని సుద్దగూడలో పులాజీ బాబా ధ్యాన మందిరంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. రాంజీగోండ్ నగర్‌కు చెందిన శంభులాల్ అన్నదానం నిర్వహించారు. పులాజీ బాబా అడుగు జాడల్లో ప్రతిఒక్కరూ నడవాలన్నారు. అనంతరం ప్రత్యేక హారతి కార్యక్రమంలో పాల్గొని బాబా చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జైవంత్ రావు, మర్సుకోల తిరుపతి, పరమేశ్వర్, శంకర్, రాములు, గోపాల్‌సేట్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

అటెన్షన్ ప్లీజ్.. యాచకులకు అడ్డాగా బస్టాండ్



ఇచ్చోడ: మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ యాచకులకు అడ్డాగా మారుతోంది. గత నెల రోజుల క్రితం ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌ను పునరుద్ధరించి బస్సులను బస్టాండ్‌లో నిలిపారు. కానీ మళ్లీ బస్సులు నిలపకపోవడంతో యాచకులు బస్టాండ్‌లో నివాసముంటున్నారు. అధికారులు స్పందించి బస్టాండ్‌ను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

– సంబంధిత అధికారి: కల్పన, ఆదిలాబాద్ ఆర్టీసీ డీఎం, ఫోన్: 99592 26002

డయేరియా నివారణకు చర్యలు

ఇచ్చోడ: రానున్న వర్షాకాలంలో డయేరియా నివారణకు చర్యలు తీసుకోవాలని నర్సాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హిమబిందు అన్నారు. శుక్రవారం ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. రైతులు బావులో నిల్వ ఉన్న నీటిని తాగవద్దని సూచించారు. కార్యక్రమంలో హెల్త్‌అసిస్టెంట్ రాథోడ్ కృష్ణ, ఎఎన్ఎం రేణుక, తదితరులు పాల్గొన్నారు.

నేడు మాలీ సంఘం సమావేశం

ఆదిలాబాద్‌రూరల్: అఖిల భారతీయ మాలీ మహాసంఘం సమావేశాన్ని శనివారం జిల్లా కేంద్రంలోని పూలే గెస్ట్‌హౌజ్‌లో ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే తెలిపారు. శుక్రవారం సంఘ భవనంలో మాట్లాడారు. సమావేశంలో మాలీలకు ఎస్టీ హోదా, మాలీ కులస్తుల సంక్షేమం, అభివృద్ధి, తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశంలో నాయకులు సాంబన్న, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నేరడిగొండ: మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఎంపీడీవో సమావేశ మందిరంలో ఉదయం 11.30 గంటలకు ఎంపీపీ రాథోడ్ సజన్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ సమద్ ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

అద్దె గదులకు వేలం

ఇచ్చోడ: ఇచ్చోడ గ్రామ పంచాయతీ పరిధిలోని అద్దె గదులకు ఈనెల 30న వేలం నిర్వహిస్తున్నట్లు ఇచ్చోడ పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఏడు అద్దె గదులు ఉన్నాయన్నారు. షెడ్యూల్ తెగలకు చెందిన వారు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

రెండో విడత గొర్రెలను పంపిణీ చేయాలి

తాంసి: గొల్ల, కురుమలకు రెండో విడత గొర్రెల యూనిట్లు ప్రభుత్వం వెంటనే పంపిణీ చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. గొర్రెలను పంపిణీ చేస్తామని చెప్పి లబ్ధిదారుల నుంచి డీడీలు తీసుకోని మూడేళ్లు గడుస్తున్నా.. నేటికీ యూనిట్లు పంపిణీ చేయలేదన్నారు. జూన్ 10లోపు లబ్ధిదారులను గుర్తించి న్యాయం చేయాలన్నారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో మండల అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి, విలాస్, ప్రకాష్, నర్సారెడ్డి పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందించాలి

ఆదిలాబాద్‌రూరల్: చెరువు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసిని రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మాలె బోరిగాం గ్రామానికి చెందిన ఆదివాసీ భూనిర్వాసితులతో కలిసి చెరువును సందర్శించారు. ఆమె మాట్లాడుతూ.. చెరువు నిర్మాణం చేపట్టి తొమ్మిదేళ్లు అవుతున్నా.. నేటికీ పరిహారం అందలేదన్నారు. ఆమె వెంట నాయకులు లీలావతి, రాము, క్రాంతికుమార్, మోహన్ అగర్వాల్, రుతిక్ ఉన్నారు.



చెరువును సందర్శిస్తున్న సుహాసినిరెడ్డి

తప్పని తాగునీటి గోస

- సరఫరా కాని మిషన్ భగీరథ నీరు

నేరడిగొండ: మండలంలోని ఆయా గ్రామాల ప్రజలకు తాగునీటి గోస తప్పడం లేదు. గాజిలి గ్రామంలో ప్రజలు తాగునీటికి అష్టకష్టాలు పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు సరిగా సరఫరా కావడం లేదని, గొంతెండు పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోని వ్యవసాయ బావి నీటిని తీసుకువచ్చి తాగాల్సి వస్తుందని వాపోతున్నారు. ప్రస్తుతం ఎండలు మండిపోతుండడంతో చేతి పంపుల వద్ద నీటి కోసం ప్రజలు బారులు తీరుతున్నారు. ఈ విషయాన్ని మిషన్ భగీరథ ఏఈ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భగీరథ నీటిని సక్రమంగా సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



చేతిపంపు వద్ద బారులు తీరిన గ్రామస్తులు

విద్యుత్ సౌకర్యం కల్పించాలి

ఇచ్చోడ: మండల కేంద్రంలోని దేశ్‌ముఖ్‌నగర్ కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సిర్ర దేవేందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిల్క దేవిదాస్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ అధికారికి అందజేశారు. గత 20 సంవత్సరాల నుంచి దేశ్‌ముఖ్‌నగర్ కాలనీలో పేదలు నివాసిస్తున్నా.. ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం కల్పించలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి కల్లెపెల్లి గంగయ్య, కాలనీ వాసులు కుంర పద్మ, అరుణ్, ఇమ్రాన్, లక్ష్మి, బాపురావు, మహేందర్ పాల్గొన్నారు.



ఏడీఏకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మాంగ్ కులస్తులకు ప్రాధాన్యతనివ్వాలి

కైలాస్‌నగర్: దళితబంధు పథకంలో నియోజకవర్గంలోని మాంగ్ కులస్తులకు ప్రాధాన్యతనివ్వాలని మాంగ్ సమాజ్ నాయకులు కోరారు. శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావును కలిసి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లో మాంగ్ సమాజ్ ఆత్మ గౌరవ భవనం నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రత్యేకంగా సిఫారసు చేయాలని విన్నవించారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతీ సంక్షేమ పథకంలో వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కులస్తుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి గాడేకర్ పరశురాం, సచిన్, ఉద్ధవ్, గణేశ్ గైక్వాడ్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న మాంగ్ కులస్తులు

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

ఉట్నూర్‌రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్ అన్నారు. మండల కేంద్రంలోని నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ) ద్వారా నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న మహిళలకు కుట్టు మిషన్‌కు కావాల్సిన బాక్స్ ఫైల్, ఫైల్ కవర్, డ్రాయింగ్ షీట్లు పంపిణీ చేశారు. అంతకు ముందు జెడ్పీటీసీని మహిళలు సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇక్బాల్, నాగాపూర్ సర్పంచ్ సునీల్‌జాదవ్, అంజత్ ఖాన్ పాల్గొన్నారు.



మెటీరియల్ అందజేస్తున్న జెడ్పీటీసీ చారులత